క్లుప్తంగా

సీజ్ చేసిన వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు బుధవారం సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వేలం పాట నిర్వహించారు. మొత్తం ఏడు వాహనాలకు వేలం పాట నిర్వహించగా పాటదారులు 6వాహనాలకు పాట పాడారు. జీఎస్టీతో కలిపి రూ.91,568ల ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యాన్ని బుధవారం సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సీఐ రామాంజినేయులు సమక్షంలో సిబ్బంది ధ్వంసం చేశారు. హంద్రీనది ఒడ్డున పాతరోడ్డుపై రూ. 1,79,070 విలువైన 232 లీటర్ల మద్యం, 54లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



మహిళలతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.నాగప్రసాద్

కోడుమూరు రూరల్: పుట్టిన పసికందు నుంచి 16సంవత్సరాల్లోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ సూచించారు. కోడుమూరులో బుధవారం జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాల ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ, పోలియో, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, హెపటైటిస్-బి వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు టీకాలను వేయించాలని సూచించారు. అనంతరం మండలంలోని వర్కూరులో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్‌తో ఆయన ఆరా తీశారు.

నేటి నుంచి ఆటల పోటీలు

సి.బెళగల్: మండలస్థాయి ఆటల పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల ఇన్‌చార్జ్, కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీలు ఉంటాయన్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి పోటీలు ఉంటాయని, హెచ్‌ఎంలు, పీఈటీలు విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేనా రాము నాయక్

కోడుమూరు రూరల్: గృహ నిర్మాణ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నేనా రాము నాయక్ కోరారు. బుధవారం ఆయన కోడుమూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీ గృహ నిర్మాణ సంస్థలో 19ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్, అప్రెంటిస్ విధానంపై వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐసీలు, అటెండర్లుగా పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు అప్రోచ్ ఉస్మాన్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దస్తగిరి, స్వాతి పాల్గొన్నారు.

గడువు ముంచుకొస్తోంది..!

- ఈ-పంట నమోదు ఈ నెల 15 వరకే అవకాశం
- సంక్షేమ పథకాలన్నింటికీ ప్రామాణికం
- ఆందోళనలో అన్నదాతలు



బిలకలగూడూరులో ఈ పంట నమోదు చేస్తున్న ఏఓ, వీఏఏ

గడివేముల: టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుంది. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీపై నేటికీ ఊసెత్తని టీడీపీ ప్రభుత్వ తీరు ఇందుకు సాక్ష్యం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తూ అమలు చేసిన ఈ-క్రాప్ నమోదు రైతులకు వరంగా నిలుస్తుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. జూలై...28 ఈ ప్రక్రియ ప్రారంభమవ్వగా ఇప్పటి వరకు దాదాపు 80 శాతం పూర్తయినట్లు అధికారుల మాట. సంక్షేమ పథకాలన్నింటికీ ప్రామాణికంగా తీసుకునే ఈ పంట నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకే అవకాశమివ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంటే ఇక మూడు రోజులు మాత్రమే మిగిలింది. ఈ మూడు రోజుల్లో అధికారిక లెక్కల ప్రకారం 20 శాతం ఈ పంట నమోదు అయ్యేపరిస్థితి లేదు. మండలంలో 22 వేల ఎకరాల సాగు పొలము ఉండగా గతేడాది 18 వేల ఎకరాల సాగు కావడంతోపాటు ఈ క్రాప్ పంట నమోదు అయ్యింది. ఈ ఖరీఫ్ (2024)సీజన్‌లో ఇప్పటి వరకు 3,946 రైతులకు గాను 13,829 ఎకరాలకు ఈ పంట నమోదు చేసినట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి చెప్పారు. ముఖ్యంగా మండలంలో మొక్కజొన్న, మినుము, సోయాబీన్, పత్తి, మిరప, వరి పంటలు సాగయ్యాయి. వివిధ కారణాలతో పంట నష్టం జరిగితే పరిహారం అందించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట నమోదు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలు

రైతులు తమ పంటను ఈ-పంటలో నమోదు చేయించుకుంటే పంట బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంక్ రుణాలు, రాయితీపై ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్ల మంజూరు సులభతరం అవ్వుతాయి. ఈ-పంటలో భాగంగా రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు, గ్రామం, సర్వే నంబర్, ఆధార్ వివరాలు నమోదు చేయించుకోవాలి. దీంతో పంట విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ఈ-పంటలో భాగంగా కౌలు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పంటల వివరాలు వ్యవసాయశాఖ గ్రామస్థాయి అసిస్టెంటు ఈ-పంట విధానంలో నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

ఈ-పంట నమోదు ఎంతో మేలు

ఈ-పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. వ్యవసాయ సహాయకుల్ని కలిస్తే ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేస్తారు. మండలంలో 80 శాతం పూర్తయింది.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణం



డీటీ రామాంజినేయులుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

కోడుమూరు రూరల్: మోటార్ యాక్ట్ సవరణ చట్టం బిల్లులో భాగంగా ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ చేసే ట్రాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న విమర్శించారు. డ్రైవింగ్ లైసెన్ టెస్టింగ్ చేసే ట్రాకులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మధు, నాయకులు ఖాజా, గిడ్డయ్య, మద్దిలేటి, నరసింహ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అదనపు టోల్ ఫీజును మినహాయించాలి





నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఆందోళనకు దిగిన అసోసియేషన్ నాయకులు

- నన్నూరు టోల్ గేట్ వద్ద మినీ లారీ అసోసియేషన్ నాయకుల ఆందోళన
- గంటన్నరపాటు స్తంభించిన వాహనాల రాకపోకలు
- పోలీసుల జోక్యంతో సద్దుమనిగిన వ్యవహారం

ఓర్వకల్లు: టోల్ ఫీజు వసూళ్లలో అదనపు బరువుకు ఫీజు మినహాయించాలని కర్నూలు మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అదనపు బరువుకు ఫీజులు వసూలు చేయకూడదని డిమాండ్ చేస్తూ బుధవారం నన్నూరు టోల్ ప్లాజా వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. దాదాపు గంటన్నర పాటు వాహనాల రాకపోకలు స్తంభించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానిక ఎస్‌ఐ సునీల్ కుమార్ రంగప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమనిగింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లను జారి చేసే విషయంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, అలాగే స్టేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న సెన్సార్ ఫిట్నెస్ ట్రాక్‌లను తక్షణమే నిలిపివేయాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే జాతీయ రహదారుల సంస్థ నిబంధనల మేరకు ఏ వాహనానికైనా సాధారణ పరిమితిని బట్టి రూ.320 లు టోల్ రుసుము చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాత పరిమితికి మించిన బరువుతో వెళ్లే వాహనాలకు రూ.120 అదనపు ఫీజు వసూలు చేయడం జరుగుతుందని టోల్ ప్లాజా మేనేజర్ శంకర్ తెలిపారు. అలా ఎందుకు చెల్లించాలని లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీఎస్ రామకృష్ణ ప్రశ్నించారు. అధిక బరువుతో వెళ్లే వాహనాలకు అదనపు ఫీజును మినహాయించాలని ఆ సంఘం నాయకులు భీష్మించారు. దీంతో టోల్ ప్లాజా అధికారులకు, అసోసియేషన్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సునీల్ కుమార్ సిబ్బందితో రంగప్రవేశం చేయడంతో లారీ యూనియన్ నాయకులు వెనక్కితగ్గారు. అసలు ముందస్తు ప్రకటనలు చేయకుండా ఆందోళన దిగడం పద్ధతి కాదని చెప్పడంతో ఆందోళనను విరమించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సామ్యుయేల్, జెనరల్ సెక్రటరి యూసఫ్‌మియా, సంయుక్త కార్యదర్శులు ప్రకాష్, ఖాదర్, నబిసాహెబ్, కోశాధికారి క్రిష్ణ మోహన్‌రెడ్డి, ఎల్‌వీఆర్ శ్రీను, ఎండి చిన్నవలి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పొదుపు కార్యాలయం



పొదుపు కార్యాలయంపైన తాగి పడేసిన మద్యం సీసాలు



ఆవరణలో పడేసిన ఖాళీ సీసాలు

గడివేముల: గడివేములలోని పొదుపు కార్యాలయం మందుబాబులకు అడ్డగా మారింది. కార్యాలయం గ్రామానికి దూరంగా ఉండటంతో పాటు నైట్‌వాచ్ మెన్ లేకపోవడంతో మందుబాబులు నిత్యం మద్యం తాగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ సీసాలను అక్కడే పడేస్తున్నారని పొదుపు మహిళలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చే సరికి కార్యాలయం వాటర్ ప్యాకెట్లు, మందు సీసాలు దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి కార్యాలయానికి కాంపౌండ్ వాల్‌తోపాటు వాచ్‌మెన్‌ను నియమించాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.

పకడ్బందీగా నమోదు చేయాలి

సి.బెళగల్: పాఠశాలల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలను హెచ్‌ఎంలు, టీచర్లు యూడైస్ ప్లస్‌లో (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ -యూడైస్) పకడ్బందీగా నమోదు చేయాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి కార్యాలయంలో యూడైస్ ప్లస్ నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నివేదికలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. పాఠశాలకు వచ్చిన నిధులు, వినియోగం, పాఠశాల అభివృద్ధి, సంక్షేమ అంశాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. హెచ్‌ఎంలకు, టీచర్లకు యూడైస్ నమోదుపై ఎంఐఎస్ రాజారావు శిక్షణ ఇచ్చారు.

నిల్వలలో తేడాలుంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు, నిల్వల తేడాలు ఉంటే చర్యలు తప్పవని ఏఓ మల్లేష్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీలు చేశారు. అమ్మకాల రికార్డులు, భౌతిక నిల్వలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు ఎరువులను ఈ పాస్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం తిరుపతి ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఏఓ తెలియజేశారు.

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి



అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీడీ శ్యామల

సి.బెళగల్:గృహ నిర్మాణాలలో పురోగతి సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. బుధవారం జిల్లా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు డీడీ హాజరయ్యారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, హౌసింగ్, ఉపాధి, డీఆర్‌డీఏ అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లతో డీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలతో పాటు, ఉపాధి పనుల కల్పన, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మంచినీటి సరఫరా, పొదుపు మహిళలకు రుణాలు తదితర అంశాలకు సంబంధించిన నివేదికలను డీడీ తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల దగ్గర వ్యక్తిగత ఇంకుడు గుంతలు, వ్యక్తి మరుగుదొడ్ల నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వి రాజ్, ఏపీఎం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



ప్యాలకుర్తిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



పాణ్యం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పాణ్యం: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కొలువుదీరిన గణనాథులను ఐదురోజులు పూజల అనంతరం బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గణనాథులను మండపాల నిర్వాహకులు, బాజా భజంత్రీలు, యువకుల నృత్యాలు మధ్య గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పాణ్యం చెరువులో గణపయ్యలను నిమజ్జనం చేశారు. పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కల్లూరు: ఐదు రోజుల పాటు భక్తుల నుంచి పూజలు అందుకున్న గననాథులు బుధవారం సాయంత్రం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. మండల పరిధిలోని సల్కాపురం, కొంగనపాడు, కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని లక్ష్మీనివాసం, తిరుమలగిరి, రాగమయూరి, కల్పవృక్షం కాలనీలలో కొలువుదీరిన గణనాథులను ఊరేగింపుంగా తీసుకెళ్లి హంద్రీ, కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

కోడుమూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అమడగుంట్ల, అనుగొండ, లద్దగిరి, ప్యాలకుర్తి గ్రామాల్లో బుధవారం ప్రశాంతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగింది. అనుగొండలో వినాయకుడి వద్ద ఉంచిన 8కిలోల లడ్డు వేలం పాటలో అత్యధికంగా యువకుడు కృష్ణ రూ.22వేలకు వేలకు దక్కించుకున్నాడు.



వినాయకునికి పూజలు చేసిన అనంతరం యువకులతో డాక్టర్ ఆదిమూలపు సతీష్



గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

కర్నూలు (రూరల్):కర్నూలు నగరంలోని 38వ వార్డు, గీతాముఖర్జీ కాలనీ కొలువుదీరిన గణనాథుడిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని కాలనీవా సులు సత్కరించారు. అనంతరం గణనాథుడిని ఊరే గింపుగా తీసుకెళ్లి కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధులో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. చెక్క భజనలు, కోలాటం, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని తుంగభద్రనది, హంద్రీ కాలువ, గార్గేయపురం చెరువు, కేసీ కెనాల్‌లో వినాయకుల విగ్రహాలను నిమజ్జనం చేశారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఫారమ్ పండ్స్, సోక్ పిట్స్ రైన్ వాటర్ స్ట్రక్చర్స్, పండ్ల తోటలు, సీడ్ ప్లాంటేషన్, పూడికతీత, రహదారులు మొదలైన రోజువారి టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, ఈసీ మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన వెళ్తున్న వాహనం

పొంచివున్న ప్రమాదం!

కర్నూలు (రూరల్) : మండల పరిధిలో పసుపల నుంచి సూదిరెడ్డిపల్లెకు వెళ్లే ప్రధాన రోడ్డులోని పెద్దమణి గుడికట్ట దగ్గర తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ రోడ్డు మలుపు ఎక్కువగా ఉంది. వాహనాలు అదుపు తప్పితే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టే ప్రమాదం లేకపోలేదు. తక్కువ ఎత్తులో ఉండడం మూలంగా చిన్నపిల్లలు, మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్లను తగిలే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై పసుపల నుంచి సూదిరెడ్డిపల్లె, నూతనపల్లె, పడిదెంపాడు, వెంకాయపల్లె గ్రామాలకు నిత్యం వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో రక్షణ గోడలేని ట్రాన్స్‌ఫార్మర్

సోలార్ పరిశ్రమకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ



ఉయ్యాలవాడలో కరపత్రాలను పంపిణీ చేసిన నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ సమీపంలో స్థాపించనున్న సోలార్ పరిశ్రమకు వ్యతిరేకంగా బుధవారం కరపత్రాలను ఏపీ రైతు సంఘం భూనిర్వాసితుల కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. రైతులకు నష్టం కల్గించే పరిశ్రమ స్థాపనను నిలిపేంత వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ నిర్మాణం చేపట్టబోమని టీడీపీ నాయకులు ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. ఉయ్యాలవాడలో భూములు సారవంతమైనవని, రెండు కార్ల పంటలు పండిస్తున్నారని గుర్తు చేశారు. ఇలాంటి భూములను సోలార్ ప్రాజెక్టు కోసం తీసుకుంటే రైతులు నిర్వాసితులవుతారని, వారితో పాటు, గొర్ల కాపరులు, పశువుల కాపర్లు ఉపాధి కోల్పోతారని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మధుసూదన్, భూనిర్వాసిత కమిటీ నాయకులు మహబూబ్‌బాషా, రైతు సంఘం నాయకులు మాసూంబాషా, గ్రామ రైతులు రామకృష్ణ, సుబ్బరాయుడు, హుసేన్, వెంకటరమణ, తిరుపతయ్య, శ్రీరాములు, వేణుగోపాల్, బ్రహ్మయ్యాచారి, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి



అధికారులతో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మిదేవి

కోడుమూరు రూరల్: అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని జేడీఏ, మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మిదేవి సూచించారు. బుధవారం వ్యవసాయ, వెటర్నరీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ అధికారులతో ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వికసిత్ ఆంధ్ర 2047' ప్రణాళికలో భాగంగా ఆయా శాఖల అధికారులు రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే పనుల వివరాల నివేదికను ఈనెల 15వతేదీలోగా సమర్పించాలన్నారు. అలాగే రానున్న వంద రోజుల్లో నిర్వహించబోయే పనుల వివరాలను కూడా ఇవ్వాలని ఆమె అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డీటీ రామాంజినేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఏపీఎం పుష్పావతి, వెటర్నరీ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి దీప్తి

కల్లూరు: ప్రభుత్వ హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దీప్తి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు పొదుపు రుణాలు మంజూరు చేయాలని ఏపీఎం శ్రీనివాసులు గౌడ్, సీసీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.